# సారీ... చెంప చెళ్ళుమనిపించా!

గీత తనను పలకరించటంతోనే వాసుకి మహదానందం కలిగింది. అసలు తనవైపు కన్నెత్తి చూడడానికి కూడా ఇష్టపడని ఆమె "హాయ్ వాసు! ఈ సాయంత్రం ప్రోగ్రామ్ ఏంటి?" అని అడగడం అతడు నమ్మలేకపోతున్నాడు.

వాసు, గీతలు కాలింగ్ సెంటర్‌లో కొలీగ్స్. ఐదడుగులా నాలుగంగుళాల ఎత్తులో తెల్లగా, తీర్చిదిద్దిన బొమ్మలా కనిపించే గీతను అతడు మొదటిరోజే ఇష్టపడ్డాడు. కాని ఆమెను ఎప్పుడూ పలకరించాలని చూసినా, అసహనంగా తలతిప్పుకునేది.

అతడు ఈ విషయమే తన మిత్రుడు రవితో చెపితే "చాలా సహజం" అన్నాడు.

తనకు కాస్త బాధగా అనిపించింది. "అలా అంటావేంట్రా! నేనూ అందంగానే వుంటాను. సంపాదన కూడా పర్వాలేదు. మరలాంటప్పుడు గీత నాతో స్నేహం చేయొచ్చు కదా?" అడిగాడు తన అనుమానం వ్యక్తం చేస్తూ.

ఈసారి రవి నవ్వాడు "గీత లాంటి అమ్మాయి ఫ్యూచర్ గురించి ఎక్కువ కలలు కంటుంది. అలాంటివాళ్ళు పర్వాలేదు అనుకునే సంపాదన వుండేవారితో కలవలేరు. వాళ్ళకు తమ కలలను నిజం చేసే ఖరీదైన ఫ్రెండ్స్ కావాలి"

రవి స్టేట్‌మెంట్ విన్నాక వాసు తన ఇంట్రస్ట్‌ని అణిచేసుకున్నాడు. కానీ ఇప్పుడు ఆమె పలకరింపు అతడిలో కొత్త ఆశలు చిగురించేలా చేసింది.



"సాయంత్రం నాకు ప్రోగ్రామ్ ఏమీ లేదు"

"మరి సాయంత్రం మనం కలుద్దామా"

తన చెవులు తనను మోసం చేస్తున్నాయేమోనన్న అనుమానం కలిగింది వాసుకి. కాని తను విన్నది నిజమేనని నిర్ధారణ చేసుకున్నాక ప్రశ్నించాడు. "ఎక్కడ కలుద్దాం?"

గీత కొన్ని క్షణాలు ఆకాశంలోకి ఆ తర్వాత అతడి ముఖంలోకి చూసింది "ది బాటిల్ రెస్టారెంట్" అంది హుషారుగా.

"అలాగే"

ఆరోజు ఆఫీసునుండి త్వరగా వెళ్ళిపోయాడు వాసు. రూంకి చేరుకుని మిత్రుడికి ఈ విషయం చెపితే అతడు "కాస్త జాగ్రత్తరోయ్" అన్నాడు.

అతడు అలా అనడం వాసుకి కోపం తెప్పించింది. "నాకిష్టమైన వ్యక్తి ఇన్వయిట్ చేస్తే వెళ్తుంటే జాగ్రత్త అంటావేంట్రా" అంటూ తన మీద ఎగిరాడు.

రవి సర్దుకుని "అది కాదురా, నేటితరం ఫాస్ట్ నేచర్ ఆడపిల్లలు హఠాత్తుగా అపరిమిత ప్రేమ చూపిస్తే మనం ఆ ప్రేమను అనుమానించి తీరాల్సిందే" చెప్పాడు.

"నీలాంటి అనుమానపక్షి జీవితంలో బాగుపడలేదు" అనేసి, తను రెడీ కావటం మొదలుపెట్టాడు.

చాలా అందంగా తయారయ్యి, అర్ధగంట ముందే ఆమె చెప్పిన రెస్టారెంట్‌కి చేరుకున్నాడు. ఆమె కోసం ఎదురుచూడసాగాడు.

అర్ధగంట గడిచింది, గీత రాలేదు.

గంట గడిచింది. ఆమె జాడ కనిపించలేదు.

వాసుకి అప్పుడు అనుమానం వచ్చింది. 'కొంపదీసి గీత తనను ఫూల్ చేయడానికే ఇలా రెస్టారెంట్‌కి ఇన్వయిట్ చేసిందేమో..ఐనా అలా చేయటం వలన ఆమెకు వచ్చిన లాభం ఏంటి?...ఊహు గీత అలా చేయదు. ఆమె అలాంటి అమ్మాయి కాదు'

అతడు అలాంటి డైలమాలో కొట్టుమిట్టాడుతుండగానే రెస్టారెంట్ ముందు ఓ కారు ఆగింది. ఆ కారు డ్రైవింగ్ సీటులో నుండి అందంతోపాటు, రిచ్‌గా కనిపించే ఓ యువకుడు దిగాడు. వాసు ఆ యువకుడికేసి చూస్తుండగానే పక్కసీట్ డోర్ తెరుచుకుని దిగింది గీత.

వాసు షాక్!

కానీ తేరుకుని ఆమె దగ్గరగా వెళ్ళాడు.."హాయ్.." అన్నాడు.

ఆమె ఓ కొత్తవ్యక్తిని చూసినట్టు చూసింది.

అప్పటికీ ఆమె చూపులు అర్థంకాక "చాలాసేపటి నుండి మీ కోసం ఎదురుచూస్తున్నాను" అన్నాడు నవ్వుతూ.

అంతే..ఆమె చెయ్యి విసురుగా కదిలి అతడి చెంపను తాకింది. "స్టుపిడ్! నా వెంట పడొద్దని ఎన్నిసార్లు చెప్పాను. నేను అందరాడపిల్లల్లాంటి దాన్ని కాదు. ఎవర్నయినా సిన్సియర్‌గా ప్రేమిస్తాను. నౌ ఐయామ్ ఇన్ లవ్ విత్ రాహుల్" అంటూ ఆ రిచ్‌మెన్ భుజం మీద చెయ్యేసింది.

వాసుకి ఆమె కొట్టడం కన్నా, అలా ఎందుకు ప్రవర్తించిందో అర్థంకాని అయోమయంగా అనిపించింది. ఇక అక్కడ వుండడం ఇష్టంలేక వడివడిగా రెస్టారెంట్ నుండి బయటపడ్డాడు.

* * *

మర్నాడు-ఆఫీసులో వాసుని పలకరించింది గీత "సారీయార్" అంది.

అతడికి ఆమె చేసిన అవమానం గుర్తుకొచ్చింది. అందుకే సీరియస్‌గా చూస్తూ "సారీ సరే! అసలు నువ్వు నన్నెందుకు కొట్టావో నాకిప్పటికీ అర్థం కాలేదు. రెస్టారెంట్‌కి నువ్వే ఇన్వయిట్ చేసావు, నువ్వే చెంపపగులగొట్టావ్" అన్నాడు ఏడుపుగొంతుతో.

"అదే చెపుతున్నాను ఫ్రెండ్.." అంటూ ఆమె క్షణమాగి కంటిన్యూ చేసింది. "నాకు ఈమధ్యనే రాహుల్‌తో పరిచయమైంది. అతడు ఓ పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్నాడు. నెలకు లక్ష రూపాయల జీతం. అయితే అతడికున్న అనుభవాల దృష్ట్యా ఈ కాలం ఆడపిల్లలు ఒక్కరైనా బోయ్ ఫ్రెండ్‌ని కలిగి వుంటారనే అనుకుంటూ వున్నాడు. నాకింత వరకూ బోయ్‌ఫ్రెండ్ లేదని అతడిని ఎలా నమ్మించాలో నాకర్థం కాలేదు. అందుకే నా వెంట పడే వాళ్ళను ఎలా చెంప పగులగొట్టి దూరంగా వుంచుతానో ప్రాక్టికల్‌గా చూపించి, రాహుల్‌ని ఇంప్రెస్ చేయడం కోసం నిన్ను వాడుకున్నాను. అంతే...సారీ"

'నీ బోయ్‌ఫ్రెండ్ ముందు నీ నిజాయితీ నిరూపించుకోవడం కోసం, నన్ను పిలిచి మరీ చెంప పగులగొడతావా? ఎంత తెలివైన దానివే' మనసులోనే గొణుక్కున్నాడు వాసు.

అంతకుమించి అతడు మరేం చేయగలడు?

-జె.సునీల్ (హైదరాబాద్)